ఇది కదా అభివృద్ధి

అద్దంలా రోడ్లు

రోడ్ల అభివృద్ధి ఇలా..

- రూ.12.50 కోట్లతో చేపట్టిన జగదాంబ-పాతనగరం రాణిబొమ్మ రోడ్డు
- రూ.కోటీ 82 లక్షలతో పూర్తయిన సెవెన్‌హిల్స్-జగదాంబ రోడ్డు
- రూ.కోటీ 71 లక్షలతో పూర్తయిన వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు
- రూ.2.5 కోట్లతో పూర్తయిన జీవీఎంసీ నుంచి పోస్టాఫీస్, సౌత్ జైల్‌రోడ్డు నుంచి కాన్వెంట్ జంక్షన్ రోడ్డు


పూర్ణామార్కెట్ రోడ్డు..


అంబేడ్కర్ విగ్రహం నుంచి ఇందిర కూడలికి వెళ్లే రోడ్డు

- రూ.12.50 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు జోరుగా విస్తరణ పనులు
- రూ.కోటీ 82 లక్షలతో పూర్తయిన సెవెన్ హిల్స్-జగదాంబ జంక్షన్‌కు వెళ్లే రోడ్డు
- రూ.కోటీ 71 లక్షలతో పూర్తయిన వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు
- రూ.కోటీ 10 లక్షలతో పూర్తయిన పాతనగరం రోడ్డు

దాబాగార్డెన్స్ : విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనిలో భాగంగా రోడ్ల విస్తరణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. నగరాభివృద్ధిలో రోడ్లు కీలకపాత్ర పోషిస్తుండడంతో రోడ్ల విస్తరణ పనులు, నూతన రోడ్లు, రోడ్ల మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి.

జోన్-4 పరిధిలో రూ.12.50 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.కోటీ 82 లక్షలతో సెవెన్‌హిల్స్ ఆస్పత్రి నుంచి జగదాంబ జంక్షన్ వరకు, రూ.కోటీ 71 లక్షలతో వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.2.5 కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పోస్టాఫీస్, సౌత్ జైల్‌రోడ్డు నుంచి కాన్వెంట్ జంక్షన్ (వయా చావుల మదుం) వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.కోటీ 10 లక్షలతో వెలంపేట రోడ్డు, మున్సిపల్ స్టేడియం జంక్షన్ నుంచి దుర్గాలమ్మ జంక్షన్ వరకు, కోటవీధి జంక్షన్ నుంచి సెయింట్ ఆలోసిస్ స్కూల్ వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.39.90 లక్షలతో కాన్వెంట్ జంక్షన్ నుంచి జ్ఞానాపురం శివాలయం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి.

రూ.12.5 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు

నగర రద్దీని దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. సుమారు రూ.12.5 కోట్లతో 2.1 కిలోమీటర్ల మేర 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు గత నెలలో ప్రారంభించారు. ఈ పనులకు సంబంధించి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భూమి పూజ చేశారు. విస్తరణతో జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు రద్దీని తగ్గించవచ్చు.

గతంలో కన్నా మిన్న..



గత ప్రభుత్వంలో ఉన్న రోడ్ల కన్నా ప్రస్తుతం నగర రోడ్లు బాగున్నాయి. ప్రధానంగా రోడ్లు బాగుంటేనే వాహనాలకు మైలేజ్ ఉంటుంది. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా రోడ్ల పరిస్థితి బాగుంది. ప్రైవేట్ కేబుల్స్ వారు రోడ్లు తవ్వకుండా చర్యలు తీసుకుంటే మంచిది.

– పసగాడ రామలింగేశ్వరరావు, స్థానికుడు, ద్విచక్రవాహనదారుడు

రోడ్లు బాగున్నాయి..



గల్లీల్లో అక్కడక్కడ రోడ్లు గతుకులున్నప్పటికీ ప్రధాన రోడ్లు బాగానే ఉన్నాయి. ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్ల పరిస్థితి మెరుగవ్వడంతో ఎటువంటి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఉంది. రోడ్లు బాగుంటేనే కదా నగరాభివృద్ధి కనిపిస్తుంది. ఎక్కడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రయాణాలు సాగుతున్నాయి.

– సీహెచ్ పవన్‌కుమార్, స్థానికుడు

రోడ్ల తవ్వకాలు చేపట్టకూడదు..



అభివృద్ధి అనేది ఇప్పటితో ఆగిపోయేది కాదు. వర్షాల కారణంగా రోడ్లు పాడవుతుంటాయి. అలా అని వదిలేయకుండా.. ఎప్పటికప్పుడు రోడ్ల మరమ్మతులు చేపడతూ ఉండాలి. ప్రస్తుతమైతే నగర రోడ్లు బాగానే ఉన్నాయి. ఎవరూ తవ్వకుండా చర్యలు చేపడితే బాగుంటుంది.

– సీహెచ్ ప్రభాకర్, స్థానికుడు


అద్దంలా మెరిసిపోతున్న స్టేడియం రోడ్డు


ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం రోడ్డు


రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు..


కలెక్టరేట్ నుంచి జగదాంబ జంక్షన్‌కి వెళ్లే రోడ్డు


దుర్గాలమ్మ గుడి జంక్షన్ రోడ్డు..

క్లుప్తంగా

రేపు కార్తీక శుద్ధ ఏకాదశి


బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం కార్తీక శుద్ధ ఏకాదశికి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారు జాము 4 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు విశేష సహస్ర నామార్చనలు జరగనున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 12 గంటల వరకు అష్టోత్తర పూజలు, దర్శనాలు కల్పించనున్నాం అన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు స్వామివారి దర్శనాలు ఉంటాయన్నారు. అనంతరం నక్షత్ర హారతి వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 23న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

నేటి నుంచి సిరి వినాయక ఆలయం వార్షికోత్సవం


నేరెళ్లకోనేరులో వెలసిన సిరి వినాయకుడు

అల్లిపురం : నేరెళ్లకోనేరులో వెలసిన శ్రీ సిరి వినాయక ఆలయం 21వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం గణపతికి పంచామృతాభిషేకాలు, జలాభిషేకం, తిరువీధి ఉత్సవం, విశేష అలంకరణ ఉంటాయని తెలిపారు. గురువారం 1001 దీపాలతో దీపారాధన, 25న మహా అన్నసమారాధనతో వార్షికోత్సవం ముగిస్తుందన్నారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

జల సంరక్షణకు నడుం బిగిద్దాం

దాబాగార్డెన్స్ : ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జల సంరక్షణ బాధ్యతను అందరం గుర్తించి ఆచరిద్దామని జనసేన పార్టీ పర్యావరణ విభాగం ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలను పరిశ్రమలకు బదలాయిస్తే విదేశీ పక్షులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. గంగవరంలో మత్స్యకారుల ప్రాంతాన్ని తీసుకోవడం వల్ల వారి బతుకులు ఛిద్రమయ్యాయని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మూగి శ్రీనివాస్, పార్టీ నాయకుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాధికార యాత్ర విజయవంతానికి పిలుపు


బస్సు యాత్రకు సంబంధించి నియోజకవర్గ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం తన కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు వివరించి, సంక్షేమాభివృద్ధి పథకాలతో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని చెప్పేందుకే ఈ యాత్ర చేపడుతున్నామని చెప్పారు. బస్సు యాత్రలో ఎమ్మెల్యేలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, ముఖ్య నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 200 మంది డైమండ్ పార్క్ సమీపాన సహపంక్తి భోజనం చేసిన అనంతరం సమీపంలో గల హోటల్లో సమావేశమై యాత్ర గురించి వివరించనున్నారని చెప్పారు. యాత్ర సాగే మార్గంలో నాయకులు ప్రజలతో మమేకం అవుతారన్నారు. బస్సుపై ఏర్పాటు చేసిన వేదిక నుంచి మాట్లాడనున్నారని పేర్కొన్నారు. యాత్రలో ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, అంజాత్ బాషా, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్నాథ్, సీహెచ్ శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ, సీదిరి అప్పలరాజు, స్పీకర్ తమ్మినేని సీతారామ్, విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ మోపిదేవి వెంకట రమణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమన్వయ సమావేశంలో పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం బాధాకరం


ఐక్యత చాటుతున్న మత్స్యకారులు

దాబాగార్డెన్స్ : ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం బాధాకరమని తీరప్రాంత వాడబలిజ సంక్షేమ సంఘం విచారం వ్యక్తం చేసింది. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసుపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రమాదం దృష్ట్యా శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో నిర్వహిస్తున్న వరల్డ్ ఫిషర్‌మెన్ డే కార్యక్రమానికి వెళ్లే ఆలోచన విరమించుకున్నట్టు చెప్పారు. సమావేశం అనంతరం ఫిషింగ్ హార్బర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అగ్నికి ఆహుతైన బోట్ల యజమానులు, బోట్లపై ఆధారపడి సర్వం కోల్పోయి, జీవనోపాధి లేక కొట్టుమిట్టాడుతున్న మత్స్యకార బాధిత కుటుంబాలను కలిసి సంఘీభావం తెలిపారు. సంఘం అధ్యక్షుడు అర్జాల వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తోలాన వెంకట శివప్రసాద్, గంపల వెంకట రామచంద్రరావు, కోనాడ ప్రకాష్, అర్జిల్ల సత్యానందం, మెరుగు ఇస్మాయిల్, నారాయణ, గంగిరి నాగేశ్వరరావు, మురిపిల్లి రమణ, వాసుపల్లి కామరాజు, చింతకాయల వెంకటరమణ, జసింగుపల్లి జ్యోతి, పొట్టి లక్ష్మి, కొవిరి పార్వతీ రామారావు, గురులక్ష్మి, గనగళ్ల సత్య, గరికిన సత్యవతి, మైలపల్లి మమత, నాగరాజు, చెన్నా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలు చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

సీతమ్మధార : జోన్-1లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు, కార్మిక వ్యతిరేక విధానాల పరిష్కారం కోరుతూ మంగళవారం జీవీఎంసీ గాంధీ పార్కులో రిలే నిరాహారదీక్షలు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి పీపీఎం రాజు పాల్గొని మాట్లాడారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, ఏఏఎస్‌లు ఇవ్వాలని, ఖాళీలు భర్తీ చేయాలని, వెహికల్ కండిషన్ మెరుగుపర్చాలని, సిక్ అయిన వారికి జీతాలు ఇవ్వాలని, ఉన్న బస్సులు రద్దు చేయడం ఆపాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జి.ఆర్. రావు, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, జోనల్ చైర్మన్ సూర్యం, రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం, అధ్యక్షుడు జి.రామకృష్ణ, డివిజనల్ సెక్రటరీ ఎ.కె. శివాజీ, అధ్యక్షుడు వీఎస్‌ఆర్ మూర్తి, జోనల్ నాయకులు, కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 3న గీతా మౌఖిక పోటీలు

దాబాగార్డెన్స్ : గీతా ప్రచార సమితి స్వర్ణోత్సవాలు, గీతా జయంతి సందర్భంగా విద్యార్థులకు గీతా మౌఖిక పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు తెలిపారు. మంగళవారం పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. భగవద్గీతలో గల 13వ అధ్యాయం క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యుగంలో శ్లోకాలపై డిసెంబర్ 3వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో ప్రథమ బహుమతులు ఉంటాయన్నారు. ఔత్సాహికులు ఈ నెల 30వ తేదీలోగా గీతాభవన్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంస్థ కార్యదర్శి ఎం. వనజాదేవిని 7032662344 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి వనజా దేవి, జి. లక్ష్మీ నరసింహ పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్ల తనిఖీ


ఐవీఎఫ్ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సరోగసీ బృందం మంగళవారం నగరంలోని పలు ఏఆర్‌టీ, ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేసింది. కుటుంబ ఐవీఎఫ్, అక్షయ ఆస్పత్రి, శ్రీ కృష్ణ హెల్త్ సెంటర్, శిశు ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు ఆయా కేంద్రాలకు పలు సూచనలు చేసి ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషిన్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో డాక్టర్ గీతా వందన (గైనకాలజిస్ట్, వీజీహెచ్) డాక్టర్ శోభశ్రీ (ఆంధ్రా యూనివర్సిటీ), ఎల్.వి.రమణి, డాక్టర్ బి.ఉమావతి (విమెన్ హెల్త్ అధికారి), బి.నాగేశ్వరరావు, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలి

మహారాణిపేట: మత్స్యకారులకు తక్షణం నష్ట పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేయాలన్నారు. హార్బర్ చరిత్రలో ఇంత పెద్ద ప్రమాదం జరగడం ఇదే మొదటి సారి అని మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు, గండి బాబ్జీ, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి మంత్రి చెల్లుబోయిన


మంత్రి వేణుగోపాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న అధికారులు

మహారాణిపేట : రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం విశాఖ చేరుకున్నారు. విజయవాడలో బయలుదేరిన ఆయన సాయంత్రం 7 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా నోవాటెల్ హోటల్‌కు విచ్చేశారు. మంత్రికి సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు వి.మణిరామ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి తదితరులు స్వాగతం పలికారు. మంత్రి వారితో కొద్దిసేపు మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సిటు కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ అనుకూల విధానాలను బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో తలపెట్టిన మహాధర్నాలో కార్మిక, ఉద్యోగ, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కె.ఎం. శ్రీనివాసరావు, ఎస్. జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

23న మార్గశిర మాసోత్సవాలకు రాట



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో వచ్చే నెల 13 నుంచి జనవరి 11వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా రాట మహోత్సవం ఈ నెల 23న నిర్వహించనున్నారు. ప్రతి ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. గురువారం ఉదయం నాదస్వర సుస్వారాలు, వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాట మహోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కె.సింహాచలం, ధర్మకర్తలు ఎం.బుద్దల అనురాధ, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు తదితరులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదం మత్స్యకారుల జీవితాల్లో చీకటి రోజుగా మిగిలిపోయిందన్నారు. నష్టపోయిన మత్స్యకారులకు 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామని చెప్పడం సంతోషించదగ్గ విషయమన్నారు. హార్బర్‌లో పోలీసు అవుట్ పోస్టు, అగ్నిమాపక శకటాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు ఇచ్చే పరిహారం విషయంలో తమను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువతులను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

దొండపర్తి : సోషల్ మీడియా ద్వారా యువతులతో పరిచయం పెంచుకొని, ఆ తర్వాత న్యూడ్ ఫొటోలు ఉన్నాయని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సోమేశ్వరరావు తెలిపారు. నగరంలో అవివాహితులకు షాప్‌చాట్ అకౌంట్ నుంచి ఓ యువకుడు రిక్వెస్ట్ పంపించి, మాయమాటలతో వారితో నగ్నంగా వీడియో కాల్ చేయించుకుని అది రికార్డు చేస్తున్నాడు. ఆ తర్వాత నగదు ఇమ్మని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. దీంతో బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వివరాల మేరకు సాంకేతికత ఆధారంగా పోలీసులు ఆరా తీశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన చిక్కుడు చంద్రమోహన్ అనే యువకుడిగా గుర్తించారు. పక్కా ఆధారాలతో అతడిని అరెస్టు చేసి, రిమాండ్ తరలించామని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సోమేశ్వరరావు తెలిపారు. కూలి పనులు చేస్తున్న అతడు సోషల్ మీడియాలో అకౌంట్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు.

విశాఖ అభివృద్ధి ప్రదాత సీఎం జగన్

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిరంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ తెలిపారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో బోట్లు కోల్పోయిన మత్స్యకారులకి 80 శాతం పరిహారంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించి మానవత చాటుకున్నారన్నారు.